క్లుప్తంగా

కల్లు గీత కార్మికుడి మృతి


శ్రీనివాసరావు (ఫైల్)

చుండూరు(భట్టిప్రోలు): తాడి చెట్టు ఎక్కి ప్రమాద వశాత్తూ కిందపడి కల్లు గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన ఇది. పోలీసుల కథనం ప్రకారం.. చుండూరుకు చెందిన గీత కార్మికుడు చేబ్రోలు శ్రీనివాసరావు ఎలియాస్ అయ్యప్ప (44) మంగళవారం సాయంత్రం తాడి చెట్టు ఎక్కి కల్లు సేకరించే క్రమంలో మోకు తెగి కింద పడ్డాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు 108 ద్వారా గుంటూరు ప్రైవేట్ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. మంగళవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్ కుమార్ తెలిపారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే ఎంసీఏ లక్ష్యం



రేపల్లె: మహిళల ఆర్థిక స్వావలంబన, వివిధ రంగాల్లో వారిని అభివృద్ధి చేసే దిశగా మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (ఎంసీఏ) పని చేస్తోందని మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ వేజళ్ల ప్రకాశరావు తెలిపారు. ఎంసీఏ ఆధ్వర్యంలో సీఈడీ ఎలిప్ సంస్థ విజయవాడ వారి ఆధ్వర్యంలో దాతలు పరిమి బాలాజీ (కాలిఫోర్నియా), మమత సహకారంతో పట్టణంలోని శ్రీ గుత్తికొండ లక్ష్మీనారాయణ కల్యాణ మండపంలో బుధవారం మహిళలకు ఫ్యాషన్ డిజైన్, కుట్టు శిక్షణ, జనపనారతో బ్యాగుల తయారీలపై ఉచిత శిక్షణ తరగతుల్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. 45 రోజులపాటు కొనసాగుతాయని, శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు బ్యాంకు నుంచి రుణ సదుపాయం కల్పించే సర్టిఫికెట్లను అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంసీఏ కార్యదర్శి జి.బాపారావు, సభ్యులు నంబూరు సత్యప్రసాద్, సాయిప్రసాద్, టైలరింగ్ శిక్షకురాలు మల్లీశ్వరి, ఎలిఫ్ సంస్థ కోఆర్డినేటర్ శోభారాణి, ఫ్యాషన్ డిజైనర్ షేక్ రేష్మా పాల్గొన్నారు.

గ్యాస్ ధరలతో సామాన్యుడు సతమతం



కర్లపాలెం: పెరిగిన గ్యాస్ ధరలతో సామాన్యుడు సతమతమవుతున్నాడని, కేంద్ర ప్రభుత్వం స్పందించి వెంటనే తగ్గించాలని ఏఐటీయూసీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు జె.బి.శ్రీధర్ కోరారు. కర్లపాలెంలో బుధవారం ఏఐటీయూసీ నాయకుల సమావేశం నిర్వహించారు. శ్రీధర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాల్ని అవలంబిస్తున్నాయని మండిపడ్డారు. కార్పొరేట్ కంపెనీలకు మేలు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని విమర్శించారు. కార్మిక సంక్షేమ సంఘం నిధుల్ని ప్రభుత్వం వినియోగించుకోవడం అన్యాయమని ఖండించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు షేక్ కరీముల్లా, అక్కల నాగిరెడ్డి, షంషుద్దీన్, అక్కల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని యువతి వృద్ధాశ్రమానికి తరలింపు



కర్లపాలెం: మతిస్థిమితం లేని ఓ యువతిని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య బుధవారం నిడుబ్రోలులోని గోతాలస్వామి వృద్ధాశ్రమానికి తరలించారు. యువతి గత రెండు రోజులుగా బుద్దాంలో తిరుగుతోంది. గ్రామస్తుల సమాచారం మేరకు ఆ గ్రామ మహిళా పోలీసు అనూష, అంగన్‌వాడీ కార్యకర్త నాగలక్ష్మి ఆ యువతిని చేరదీసి, విషయాన్ని సీడీపీవో వెంకటరమణకు తెలియజేశారు. ఆమె ఆదేశాల మేరకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య సహకారంతో పొన్నూరు మండలంల నిడుబ్రోలులో ఉన్న గోతాలస్వామి వృద్ధాశ్రమానికి యువతిని తరలించారు.

6న ఉచిత కంటి వైద్య శిబిరం

బాపట్ల అర్బన్: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బడుగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు బజరంగ్ ఫౌండేషన్ కృషి చేస్తోందన్నారు. బాపట్ల సముద్ర తీర ప్రాంత గ్రామాల్లో ఈనెల 6న కంటి వైద్య పరీక్షల శిబిరం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఉచితంగా కంటి పరీక్షలు చేసి కళ్లజోళ్లు అందజేస్తామని తెలియజేశారు. సముద్ర తీర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

మనో‘హర’.. మల్లేశ్వరా..

- నేటి నుంచి మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు
- 6న వైభవంగా రథోత్సవం
- రాష్ట్రంలోనే అతిపెద్ద రథాల్లో ఒకటిగా గుర్తింపు


భట్టిప్రోలులో కొలువుదీరిన మల్లేశ్వరస్వామి


రహదారులను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, సర్పంచ్ రవి కిరణ్మయి, ఎంపీపీ లలిత కుమారి తదితరులు


ఉత్సవానికి ముస్తాబవుతున్న భట్టిప్రోలు రథం

భట్టిప్రోలు: ప్రసిద్ధి గాంచిన భ్రమరాంబ మల్లేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. భట్టిప్రోలు తిరునాళ్లగా పేరుపొందిన ఈ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 5న స్వామి దివ్య కల్యాణం జరుగుతుంది. ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి నాడు (ఈ నెల 6న) రథోత్సవానికి పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. ఈ ఆలయాన్ని 1689లో అద్దేపల్లి–భట్టిప్రోలు పద్మశాలీయ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించారు. అప్పటి నుంచి ఏటా కార్తీక మాస పూజలు, దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు, శ్రీవారి బ్రహోత్సవాలు క్రమం తప్పకుండా చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల నిమిత్తం 1910లో ఒక రథాన్ని నిర్మించారు. అది 1913లో దీపావళి పర్వదినాన నిప్పు రవ్వలు పడి పూర్తిగా దగ్ధమైంది. ఆ తరువాత మూడేళ్ళ పాటు రథోత్సవానికి అంతరాయం కలిగింది. 1916లో కొత్త రథం నిర్మితమైంది. రాష్ట్రంలోని పెద్ద రథాలలో భట్టిప్రోలుది ఒకటి. ఆలయానికి 1689లో అప్పటి రాచూరు జమిందార్ వెంకటాద్రి నాయుడు 12 ఎకరాల భూమిని ఇచ్చారు. రథోత్సవంలో మతాలకతీతంగా ప్రజలు పాల్గొనడం ప్రత్యేకత. సుమారు లక్ష మంది తరలివస్తారని అంచనా. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలతోపాటు భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి దీవి వెంకట అప్పలాచార్యులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

రథోత్సవానికి పటిష్ట చర్యలు

కల్యాణ మల్లేశ్వరుడు 6వ తేదీన రథోత్సవంపై ఊరేగనున్న సందర్భంగా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ ఎం.ఎల్. శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ తిరునాళ్లలో భాగంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. అనంతరం మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలసి ఆయన రథాన్ని పరిశీలించారు. స్థానిక రథం సెంటర్ నుంచి అద్దేపల్లి వరకు గల రహదారిని పరిశీలించారు. అక్కడక్కడా ఉన్న ఆక్రమణల్ని తొలగించాలని ఆదేశించారు. కేబుల్, టెలిఫోన్ వైర్లు అడ్డు లేకుండా చూడాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దారా రవి కిరణ్మయి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, దేవాలయ కార్యనిర్వాహణాధికారి దీవి వెంకట అప్పలాచార్యులు, ఆర్ఐ శివ రామకృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి. శ్రీరాములు, పద్మశాలీయ సంఘీయులు బండారు దేవీ వరప్రసాద్, రామనాథం రామకృష్ణ, పోలీస్, పంచాయతీ, విద్యుత్ సిబ్బంది, వంశపారంపర్య ధర్మకర్తలు కొడాలి పానకాలరావు, రామశాస్త్రి, శంకరరావు, లక్ష్మీకాంతారావు పాల్గొన్నారు.

భాష్యంలో ఆకట్టుకున్న సైన్స్ డే

రేపల్లె: పట్టణంలోని భాష్యం పబ్లిక్ స్కూలులో బుధవారం సైన్స్ డే నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన పలు ప్రాజెక్ట్‌లు ఆకట్టుకున్నాయి. ప్రదర్శనను భాష్యం విద్యా సంస్థల జడ్ఈవో హృదయరాజు ప్రారంభించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు పట్టణ ప్రజలు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, హెచ్ఎం లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

పెదపులివర్రులో రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు



పెదపులివర్రు(భట్టిప్రోలు): చరిత్ర పుటల్లో ప్రాముఖ్యతను సంతరించుకుని భక్తుల్ని విశేషంగా ఆకర్షిస్తున్న భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామంలో కొలువైన శ్రీ భూ నీళా సమేత శ్రీ వరదరాజస్వామి బ్రహోత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. అతి ప్రాచీన దేవస్థానాల్లో ఒకటైన ఈ ఆలయం వ్యాఘ్రపాద మహర్షి ఆశ్రమం. శ్రీ రాజరాజ నరేంద్రుని దృష్టిని ఆకర్షించిన పవిత్ర క్షేత్రం. శ్రీ వ్యాఘ్రపాద మహర్షి కోరికపై శ్రీ కంచి వరదరాజస్వామి ఇక్కడ వెలిశారు. శ్రీ రాజరాజ నరేంద్రుడు ఆలయ ప్రాకారాలు నిర్మించి నల్లూరి వంశస్తులను అర్చకులుగా నియమించారు. శ్రీమద్‌రామానుజాచార్యులు విడిది చేసి శ్రీవరద రాజస్వామిని సేవించడం వల్ల ఈ క్షేత్రం పవిత్ర క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. ఈ దేవాలయాన్ని 1512లో బెజవాడ సామ్రాజ్యాధినేతలు పునః ప్రతిష్ఠించినట్లు దేవాలయంలో శాసనాలు ఉన్నాయి. స్వామి కల్యాణం పంచాహ్నికంగా, వైభవంగా ఫాల్గుణ పౌర్ణమికి జరగనున్నది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని 9వ తేదీ వరకు పూజలు నిర్వహించనున్నట్లు దేవస్థాన కార్యనిర్వాహణాధికారి మేకా సాంబశివరావు తెలిపారు. ధర్మకర్తల మండలి అధ్యక్షులు కంఠంనేని హరిప్రసాద్, సభ్యులు కార్యక్రమాల్ని పర్యవేక్షిస్తున్నారు.

నేడు వైఎస్సార్ సీపీ నేత యలవర్తి విగ్రహావిష్కరణ

కూచిపూడి(వేమూరు): అమర్తలూరు మండలంలోని కూచిపూడిలో గురువారం వైఎస్సార్ సీపీ నేత యలవర్తి రామ్మోహన్‌రావు విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు యలవర్తి సురేష్ తెలిపారు. మండలంలోని కూచిపూడికి చెందిన రామ్మోహన్‌రావు రెండు పర్యాయాలు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడిగా పని చేశారు. విగ్రహావిష్కరణలో మాజీ మంత్రి కొడాలి నాని, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ, బాపట్ల ఎంపీ నందిగామ సురేష్, తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, బాపట్ల జిల్లా ఉడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు పాల్గొంటారని సురేష్ పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

నూతన వస్త్రాల పంపిణీ

తెనాలి అర్బన్: ట్రైబల్స్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత రావూరి అంజలి ఆధ్వర్యంలో యడ్ల లింగయ్య కాలనీలోని గిరిజనులను బుధవారం నూతన వస్త్రాలు, బియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద గిరిజనులు, సంచార జాతుల వారికి సంస్థ ద్వారా సాయం చేస్తున్నట్లు తెలిపారు. ట్రస్ట్ డైరెక్టర్ రావూరి సురేష్‌బాబు, సభ్యులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలకు సీఎం జగన్ ప్రాధాన్యత

మంత్రి మేరుగ నాగార్జున


సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకుంటున్న మంత్రి మేరుగ నాగార్జున

బలిజేపల్లి(వేమూరు): వ్యవసాయం రంగాన్ని సుభిక్షంగా ముందుకు తీసుకెళ్లడానికి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. వేమూరు మండలంలోని బలిజేపల్లిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.

మంత్రి ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరు గురించి ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వాటిని వెంటనే వేయించాలని మంత్రి దృష్టికి పలువురు తీసుకెళ్లారు. రోడ్లు వేసేందుకు వెంటనే చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట నష్ట పోయిన రైతులకు పరిహారాన్ని మూడు నెలల్లోనే అందించిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రతి రైతుకు సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబు వ్యవసాయం దండగ అని హేళన చేయగా, ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి పండుగ అని నిరూపించినట్లు చెప్పారు. రైతుల సమస్యలకు ఆయన అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ యల్లమాటి మోహన్, గ్రామ సర్పంచ్ బొజ్జా వెంకయమ్మ, గాజుల భాను ప్రకాశ్, ఎంపీటీసీ కొందూరు నాగరాజు కుమారి, బొల్లిముంత ఏడుకొండలు, గుండాల ప్రతాప్, జలి ఏబు, కంచర్ల సుశీలరావు, బెల్లంకొండ శివ పార్వతి, రాయపూడి శ్రీనివాసరావు, రాయపూడి బుజ్జిబాబు, కస్తూరి సాంబశివరావు, పరిస రామయ్య, కొండిశెట్టి రాంబాబు, కోగంటి లవకుమార్, గాజుల మోహన్, విష్ణుమొలకల వెంకట రెడ్డియ్య, దున్నా మేరీ సుబాబు, సజ్జా శ్రీనివాసరరావు, దొప్పలపూడి జ్యోతిబాబు, వేమూరు ఉప సర్పంచ్ తలతోటి ప్రదీప్, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తైక్వాండోలో రేపల్లె కింగ్స్‌వే క్రీడాకారుల ప్రతిభ


క్రీడాకారులను అభినందిస్తున్న కింగ్స్‌వే తైక్వాందో నిర్వాహకులు

రేపల్లె: న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా అసోసియేషన్ ఇటీవల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఉమ్మడి గుంటూరు జిల్లా తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించింది. ఇందులో పట్టణానికి చెందిన కింగ్స్‌వే తైక్వాండో అకాడమీ క్రీడాకారులు ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా స్థానిక అకాడమీలో బుధవారం క్రీడాకారులకు నిర్వహించిన అభినందన కార్యక్రమంలో అకాడమీ ఫౌండర్ కె.జగన్‌మోహన్‌రావు మాట్లాడారు. ఉమ్మడి గుంటూరు జిల్లా తైక్వాండో పోటీల్లో తమ అకాడమీ క్రీడాకారులు 20 బంగారు, 12 రజత, 15 కాంస్య పతాకాలు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారని తెలిపారు. బాలికల విభాగంలో ఆర్. లావణ్య, ఎ.రామ, కె.నేహ, కె.తేజనాగశ్రీ , విజ్ఞశ్రీ, నివేదిత, వర్షిత, వేద పౌర్ణమి, రోషిణి, సుమ, షాహీనా, మీనాక్షి, కావ్యశ్రీ , జోషిత, బాలుర విభాగంలో భువన్‌కుమార్, భార్గవ్, మోక్షజ్ఞ, ప్రణవ్, యువతేజ, కౌశిక్, కుషల్‌వర్మ, మహశ్విన్‌లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఆ పోటీల్లోనూ తమ క్రీడాకారులు విజయకేతనం ఎగురవేయాలని ఆయన ఆకాంక్షించారు.

తెల్లవారక ముందే పింఛన్ల పంపిణీ


జిలుగువారిపాలెంలో విభిన్న ప్రతిభా వంతుడికి పింఛన్ అందిస్తున్న ఎంపీపీ లలిత కుమారి


అమృతలూరులో పింఛన్ అందిస్తున్న మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఇమామ్ హుస్సేన్

భట్టిప్రోలు: మండలంలో శుక్రవారం తెల్లవారక ముందే 4 గంటల నుంచి 12 సచివాలయాల పరిధిలోని వలంటీర్లు పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. ప్రభుత్వ కృషి, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సేవాభావంతో పంపిణీ నిరాటంకంగా జరిగింది. పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని జిలుగువారిపాలేనికి చెందిన విభిన్న ప్రతిభావంతుడైన బాలుడు యశ్వంత్‌కు ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, అద్దేపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకులు తలకొల యలమంద, అమృతలూరులో వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఇమామ్ హుస్సేన్ పంపిణీ చేశారు. ఉదయం 11 గంటలకే దాదాపు పంపిణీ పూర్తయ్యింది. కొందరు పింఛన్‌దారుల ఇంటి వద్ద లేకపోవడంతో వారు పనులు చేస్తున్న చోటకు వెళ్లి నగదు అందచేయడం గమనార్హం. ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న వారికి సైతం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు మాట్లాడుతూ నూరు శాతం పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మండలంలో మొత్తం 8,295 పింఛన్లకు గాను సాయంత్రానికి 81.70 శాతం పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. పలుచోట్ల పంపిణీని ఆయన పరిశీలించారు. ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తున్నారా లేదా అని లబ్ధిదారుల్ని అడిగి తెలుసుకున్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్


ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న సందర్శకులు

భట్టిప్రోలు: జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని భట్టిప్రోలు విశ్వశాంతి హైస్కూలులో రెండు రోజుల పాటు నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా 6 నుంచి 9వ తరగతి విద్యార్థులు 270 ప్రాజెక్టుల్ని ప్రదర్శించారు. మండలంలోని పలు పాఠశాలలు, హైస్కూళ్ల విద్యార్థులు అధిక సంఖ్యలో ప్రదర్శనను తిలకించారు. ప్రధానోపాధ్యాయుడు ఫణి పార్థసారథి మాట్లాడుతూ నోబెల్ బహుమతి గ్రహీత సీవీ రామన్ ప్రపంచానికి రామన్ ఎఫెక్ట్‌ను అందించిన రోజును భారత ప్రభుత్వం జాతీయ సైన్స్ దినోత్సవంగా ప్రకటించిందని వివరించారు. సైన్స్‌ను చక్కగా వినియోగించుకుంటే మానవ జాతికి వరమని, లేనిపక్షంలో వినాశనమని పేర్కొన్నారు. వైద్య, విద్య, విద్యుత్ తదితర రంగాల్లో నిత్యం మనం సైన్స్‌ను వినియోగించుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమాన్ని కరస్పాండెంట్ ఎంపీ వెంకట్రావు, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

సమస్యలను విన్నవించి పరిష్కరించుకోవాలి

- ప్రజా సమస్యల పరిష్కారానికే ‘గడప గడపకు మన ప్రభుత్వం’
- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు


ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లె రూరల్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు సమస్యల్ని విన్నవించి పరిష్కరించుకోవాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని బేతపూడి గ్రామంలో మూడో రోజు బుధవారం సాయంత్రం ఆయన పర్యటించారు.

ప్రజలకు ప్రభుత్వ పథకాల్ని వివరించడంతో పాటు సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని అడిగి తెలుసుకుని, సత్వరమే పరిష్కరించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమం ద్వారా ప్రజల ముంగిటకు పంపుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో 220 ఇళ్లను పర్యటించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గాదె వెంకయ్యబాబు, సర్పంచ్ ఆలూరి పద్మ, జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కొమరాబత్తుని జయమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంచి మనసున్న పరిపాలనాదక్షుడికి ప్రకృతి సహకరిస్తుంది

మంచి మనసున్న పరిపాలనాదక్షుడికి ప్రకృతి సైతం సహకరిస్తుందనడానికి రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి పాలనే నిదర్శనమని మోపిదేవి వెంకట రమణారావు చెప్పారు. బేతపూడిలో ఆయన విలేకర్లతో మాట్లాడారుఉ. గడిచిన మూడున్నర ఏళ్లలో వర్షాలు సకాలంలో పడటంతో పాటు కాల్వల్లో సమృద్ధిగా నీరు రావడంతో పంటలు బాగా పండి రైతులు సుఖసంతోషాలతో జీవిస్తున్నారని తెలిపారు. ఏటా ఖరీఫ్‌కు ముందుగానే రైతులకు పెట్టుబడిసాయం అందిస్తూ సీఎం చేయూతనందిస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో 175 స్థానాల్లో సింగిల్‌గా పోటీ చేసి గెలిచి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. జనసేన, టీడీపీలు పొత్తులు లేకుండా పోటీ చేస్తారా ? అని జగన్‌మోహన్‌రెడ్డి విసిరిన సవాలును స్వీకరించే సత్తా ఆ రెండు పార్టీలకు ఉందా? అని చెప్పాలన్నారు.

శ్రీ రామమందిరంలో ఎంపీ ప్రత్యేక పూజలు

రేపల్లె: పట్టణంలోని 7వవార్డు గమిడివారి వీధిలో నూతనంగా నిర్మించిన శ్రీ రామమందిరంలో విగ్రహ పునః ప్రతిష్టను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమాలు, పూర్ణాహుతి, శాంతి కల్యాణం జరిపారు. పూజల్లో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్న సంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వివిధ వార్డుల కౌన్సిలర్లు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా ‘సంక్షేమ’ం అమలు లక్ష్యం

ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు


హాజరైన కౌన్సిలర్లు, గృహ సారథులు, వలంటీర్లు, కన్వీనర్లు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి

రేపల్లె రూరల్: రాజకీయాలకు అతీతంగా అర్హులైన లబ్ధిదారుల్ని ఎంపిక చేసి ప్రభుత్వ పథకాల్ని అందించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులతో పాటు గృహ సారథులు, వలంటీర్లు, కన్వీనర్లపై ఉందని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకటరమణారావు సూచించారు. ప్రభుత్వ విధానాలపై బుధవారం పట్టణంలోని రామకోటిపేట సీతారామయోగిని కల్యాణ మండపంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, కన్వీనర్లతో పాటు నూతనంగా ఎన్నికైన గృహ సారథులు సమన్వయంగా పనిచేసి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో రాజకీయాలు చేయవద్దన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయానికి అనుగుణంగా పని చేయాలని చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీల్ని ప్రజాప్రతినిధుల సహకారంతో పరిష్కరించాలని తెలిపారు. పథకాలకు ఎంపికకాని లబ్ధిదారులకు వివరంగా కారణాల్ని తెలియజేయాలని చెప్పారు. గత ప్రభుత్వంలోని జన్మభూమి కమిటీల మాదిరిగా ప్రజల్ని ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజాప్రతినిధులతో పాటు కన్వీనర్లు, వలంటీర్ల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. ప్రజలతో దురుసుగా వ్యవహరించినా, ప్రభుత్వ కార్యక్రమాల్ని చేరవేయడంలో నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అనంతరం పలు అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ నియోజక వర్గ పరిశీలకుడు వనమాల వజ్రబాబు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ, వైస్ చైర్మన్లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త పాల్గొన్నారు.

తల్లిదండ్రులే బిడ్డల నిజమైన శ్రేయోభిలాషులు

11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.మాలతి

తెనాలి: బిడ్డలకు తల్లిదండ్రులే నిజమైన శ్రేయోభిలాషులని, వారి ఆశీస్సులతో ముందుకు సాగుతూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.మాలతి సూచించారు. స్థానిక బోసురోడ్డులోని నెహ్రూ నికేతన్ జూనియర్ కాలేజీలో బుధవారం ఉదయం ద్వితీయ ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు సభకు నెహ్రూ నికేతన్ మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ దాసరి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి మాలతి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, తల్లిదండ్రులు, అధ్యాపకుల సలహాలు, సూచనలతో చక్కగా చదువుకుంటే భవిష్యత్‌కు తగిన పునాది పడుతుందన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన, భావప్రకటన నైపుణ్యాన్ని అలవరచుకుంటూ మంచి కెరీర్ లభిస్తుందని చెప్పారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.గీతాకాంత్, ప్రిన్సిపాల్ వీరంకి శేషగిరిరావు, వైస్‌ప్రిన్సిపాల్ పి.నాగశంకర్ మాట్లాడారు. తొలుత న్యాయమూర్తి మాలతిని సత్కరించారు. సభానంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.